


# అడుగడుక్కీ...

కొమ్మూరి వేణుగోపాలరావు


"నేనివాళనుంచి అబద్ధం చెప్పను" అనుకున్నాడు ఆనందరావు పొద్దున్న ఆవులించి.

'అవును నిజం నేనబద్ధం చెప్పనే చెప్పను' అనుకున్నాడు.

"అయ్యగారు యిప్పుడా నిద్రలేవటం. గడియారం వైపు చూడండి కాస్త. ఎనిమిదయింది" అంది భార్య సుగుణ ఎత్తిపొడుస్తూ.

ఈ యెత్తిపొడుపుకు ఆనందరావు చిన్నబుచ్చుకున్నాడు. "రాత్రి పన్నెండింటి వరకూ పాడు ఆఫీసు కాయితాలు చూసి పడుకున్నానా?" అన్నాడు.

"ఎంత తడుముకోకుండా వస్తాయండీ అబద్ధాలు?" అని అతని ముఖంమీదకు వంగి "రాత్రి ఎన్ని గంటలకి?" అని అడిగింది.



"రాత్రి ఎన్నిగంటలకీ!" అంది సుగుణ

ఆనందరావుకు సిగ్గుతో చచ్చిన చావయింది. "పో నువ్వు" అని దుప్పటి కప్పుకున్నాడు ముఖంమీద. అతనికి ఉక్రోషం వచ్చింది. "ఛ ఛ నోరు జారిపోయింది. ఇహ అబద్ధం చెప్పను" అనుకున్నాడు.

ఆనందరావు స్నానంచేసి యివతలకు వస్తూండేసరికి పరంధామయ్యగారు ఊడిపడి "యివాళయినా యిచ్చేదుందా? ఎగనామమేనా?" అన్నారు.

"అయ్యా పపగారూ ఒక్క మనవి" అన్నాడు ఆనందరావు గుటకలు మింగి.

"పప ఏమిటయ్యా పప. లక్షణంగా పేరు పెట్టి పిలవలేవూ. ఈజారుముడిగాడ్ని చూస్తే అంత ఎకసెక్కమా?" అన్నాడాయన ఆగ్రహించి. ఆయన పూర్తిపేరు పరమాత్మల పరంధామయ్యగారు.

"క్షమించాలి. పరంధామయ్యగారూ. ఈ పీటముడిగాడ్ని కాస్త కనికరించాలి. జీతాలింకా రాలేదు. మా సెక్రటరీ సెలవుమీద వున్నాడు. రెండు రోజులాగితే?" అంటూ ఆనందరావు నసిగాడు.

శాస్త్రయుక్తంగా ఒక బస్తాడు తిట్లు తిట్టి, ఛందస్సు తప్పకుండా ముప్ఫయి వార్నింగులిచ్చి రంగంమీద నుంచి నిష్క్రమించాడు పరంధామయ్యగారు.



వార్నింగులిచ్చి నిష్క్రమించాడు పరంధామయ్య.

వాస్తవిక జీవితంలో ఎలా వున్నా యిది కథ క్రింద చెప్పుకుంటున్నాం. కాబట్టి కథానాయకుడు ఆనందరావు మంచివాడని ఒప్పుకొని అతన్ని పరంధామయ్యలాంటి విలన్ను చాల బాధలు పెడుతున్నందుకు మనమందరమూ కోపగించుకోవాలి.

"అమ్మయ్య" అనుకున్నాడు ఆనందరావు.

"నిన్ననే కదుట్రా లక్షణంగా నూట యాభయి రూపాయలూ జీతం పుచ్చుకున్నావు" అని ఘోష పెట్టింది అతగాడి అంతరాత్మ.

తను అసలు అబద్ధమాడుతున్నాడనే అనుకోలేదు. అనుకున్నా ఎవరూ వినలేదని ఆనందించాడు. కాని ఖర్మ. అంతరాత్మ వింది.

ఇదివరకు లేదు గాని ఈమధ్య సినిమాలు చూడటం ఎక్కువయాక చీటికీమాటికీ దర్శనమిస్తోంది అతగాడి అంతరాత్మ.

"ఇదే ఆఖరిసారి. యింక చెప్పను" అని చెంపలు వాయించుకుని బుద్ధిమంతుడిలా లోపలకు నడిచాడు.

చాలామంది కథానాయకుల లాగానే యితనికి ఒక చక్కని భార్యతోపాటూ ఆరోళ్ళకుంటడు, రోగంతో ముక్కిమూలిగే తండ్రి, కోడలుపైని అధికారం చలాయించే తల్లి వున్నారు.

"నల్లమందురా నాయనా" అన్నాడు తండ్రి.

"ఇంకా పెర్మిట్ రాలేదు. దానికోసమే చూస్తున్నా" నన్నాడు ఆనందరావు.

వెంటనే అంతరాత్మ వీపుమీద ఒకటి వడ్డించింది.

"కోడల్ని తీసుకెళ్ళమని వాళ్ళకు ఉత్తరం రాశావట్రా?" అంది తల్లి.

"ఆఁ నిన్ననే రాశా కవరు."

"కవ రెందుకు యీమాత్రం భాగ్యానికి?



మాత్ ఆర్గన్ కావాలన్న
కొడుకుతో...

ఈమధ్య రెండు పైసలు పెరిగిందిట కూడాను." అని ఆమె విసుక్కుంది.

"నువ్వేన్నయినా చెప్పు. వాడికి పొదుపు తెలియకే" అంటూ తండ్రి అందుకున్నాడు.

ఆనందరావు తల పట్టుకుని యివతలకు వచ్చాడు. ఈ నాలికను కోసిపారేయాలని పించింది. ఛీ. అనుకోకుండా అన్నీ అబద్ధాలు. తప్పటల్లా.

ఇంతలో కొడుకు వచ్చి "నాన్నా! మాతీఆర్గన్ కనుక్కున్నావు నిన్న?" అని చిక్కు ప్రశ్న వేశాడు. వాడికి దానిమీద ఫారిన్ మ్యూజిక్కు వాయించాలని మోజు.

"అవతారం.షాపులో నిన్న కనుకున్నా నురా నాన్నా. ఇంకా బొంబాయినుంచి రాలేదుట" అన్నాడు అభాగ్యుడు.

హఠాత్తుగా యీ అబద్ధంలోకి అవతారం కూడా కొట్టుకువచ్చాడు న్యాచురల్ గా వుండేందుకు.

"పో. నువ్వెప్పుడూ యింతే" అని కుమార రత్నం ముఖం ముడుచుకుని వెళ్ళిపోయాడు.

"ఆనందరావు అన్నం ముందు కూర్చుని అదిరిపడ్డాడు.

"కడుపనుకున్నావా? కళ్ళేపల్లి చెరువనుకున్నావా?" అన్నాడు. అతను బందరు ప్రాంతంనుంచి వచ్చాడు.

సుగుణ తణుకు తాలూకా మనిషి. "కాదు. ఖండవిల్లి మడుగనుకున్నాను" అంటూ నవ్వింది

ఆనందరావు చక్కా భోంచేసి ఆఫీసుకు బయల్దేరాడు. పోస్టాఫీసు ఎదురైంది. పోష్టుమేన్ చుటూ మనుషులు ఉత్తరాలకోసం గుమికూడారు. ఆనందరావు కూడా తల దూర్చాడు. "నాకేమైనా ఉత్తరాలున్నాయేమో చప్పున చూడు నాంచారయ్యా. అర్జంటు పనివుంది పోవాలి" అంటూ అడిగాడు.

వెంటనే నాలికకరచుకున్నాడు. అర్జంటు పని వుందని ఎందుకు చెప్పాడు? ఆఫీసుకు పోవాలని ఎందుకు చెప్పలేదు.

ఆనందరావుకు ఉత్తరం వచ్చింది.

అందులో అతని చెల్లాయి యిట్లా రాసింది. "అన్నాయ్, మీ బావకు జబ్బ యింకా తగ్గలేదు. డబ్బులేక చాలా యిబ్బంది పడుతున్నాము-ఓ పాతిక రూపాయలు పంపించవూ?"

అనిక్క దానికి జవాబు ఎలా రాయాలో ఆలోచిస్తున్నాడు ఆనందరావు. కొత్త కొత్త కారణాలు. తనకు యీ నెలజీతం రాకపోవటమూ, అబ్బాయిని స్కూల్లో చేరిపించటమూ, అర్జంటుగా స్నేహితుడి భార్య చచ్చిపోవడమూ యిత్యాదులు.

అతను ఆఫీసుకు చేరేసరికి రోజూకన్న అరగంట ఆలస్యమైంది. సెక్రటరి తల ఎత్తి ఉరిమిచూచాడు. ఆనందరావు వొణుకుతున్న గొంతుకతో "డాక్టర్ వేణుగోపాలరావు దగ్గర ఆలశ్యమైపోయిందండి. ఆయన సాయంత్రాలు డిస్పెన్సరీ తెరవడు. మా మిసెస్ కు సుస్తిగావుంటే?" అన్నాడు.

"ఊఁ" అన్నాడు సెక్రెటరీ భావయుక్తంగా.

ఒక అయిదు నిమిషాలు గడిచాక ప్రక్క సీట్లోని సుందర్రావు నవ్వాడు గర్వంగా. ఆనందరావు తలత్రిప్పి ఏమిటి అన్నట్లు చూశాడు.

"అందుకే యీ అబద్ధాలంటే నాకు అంత గౌరవం, అపేక్ష. మనను రక్షించాలన్నా, మన పరువులు కాపాడాలన్న ఆవే దిక్కు. నేనైతే వాటిని ఆరాధిస్తాను" అన్నాడు సుందర్రావు.

"మరి మన రామాయణం, భాగవతం, పురాణాలు?" అన్నాడు ఆనందరావు ఆశ్చర్యంగా.

"చిట్టికొయ్యా" అన్నాడు సుందర్రావు దర్పంగా. "ఈ భారత భాగవతాలు ఎందుకు పనికివస్తాయో తెలుసా? అప్రయోజకులు, అమాయకులు తేగినన్ని ఉదాహరణలు చూపించుకునేందుకు."

ఈనాటికి సుందర్రావు కొత్త సత్యం కనిపెట్టాడు. ఆనందరావు పనిలో పడ్డాడు. అతని కలం వణికింది. చెయ్యి వణికింది. ఆలోచన వణికింది.

అతని ముఖం ఎరుపుకన్నా ఎర్రగా మారింది.

"అబద్ధానికి, మనిషికీ అంతదగ్గర సంబంధమా?" అని ప్రశ్నించుకున్నాడు.

"అనువు" అనుకున్నాడు.

"కాదు" అనుకున్నాడు.

తను యివాళ నిద్రలేవగానే ఏమి నిశ్చయించుకున్నాడు? చస్తే అబద్ధం చెప్పకూడదనుకున్నాడుగా.




సంజాయిషీ అడిగిన సెక్రటరీ
ఎదుట...

ఏమయినాసరే, ఆ నియమం పాటించాలి. "అక్కర్లేదు" అంటున్నాడు సుందర్రావు.

రాత్రి ఏడుగంటలకు యింటివైపు నడుస్తున్నాడు. ఇప్పుడింటికిపోవాలి. వెళ్ళగానే భార్యతో ఒకటి, తనయుడితో ఒకటి, అమ్మతో ఒకటి, నాన్నతో ఒకటి. అబద్ధాలు, అబద్ధాలు.

ఆనందరావు చీకట్లో నవ్వుకున్నాడు. ఆ నవ్వు నల్లగా వుంది.

మరి ఇన్నీ తెలిసే, యిన్నీ ఆలోచించే, అలా నల్లగా నవ్వగలగటం చాతనై వుంటే మరునాడు లేస్తూనే అతను "కనీసం ఇవాళ్ళనుంచయితే అబద్ధం చెప్పను" అనుకున్నాడు.

★


తెల్ల వెంట్రుక లుండవు
(GOVT REGD).
రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము. మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 50 సం॥ ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధి చేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5/- 3 సీసాలు రు. 12, సగము నెరసివుంటే ఒకసీసా రు.6/- 3 సీసాలు రు.15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి ఫ్రీ.
MODERN DRUGS CORPN
(106) P. O. Pakribardwan (Gaya)